సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం । 31 । ఆగస్టు । 2024



14న లోక్ అదాలత్

వచ్చే నెల 14న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా కోర్టులున్న అన్ని ప్రదేశాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. 8లో ▸



ఐదుగురి అరెస్టు

భీమడోలు మండలం అర్జావారిగూడెంలో జరిగిన హత్య కేసులో పోలీసులు ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. 8లో ▸



ఓటర్ల జాబితాలో సవరణలు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ ప్రారంభమైంది. సవరణలకు సంబంధించి అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

మొక్కలతోనే మనుగడ



మొక్కలు నాటుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం అర్బన్: మొక్కలతో మానవుడి మనుగడ ఆధారపడి ఉందని, అందరూ విధిగా మొక్కలు పెంచాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మండలంలోని బేతపూడి జెడ్పీ హైస్కూల్‌లో వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డితో కలిసి ఆమె మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ హితంగా మొక్కలు నాటడం అందరి బాధ్యత అన్నారు. ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ పెరటిలో నాటే మొక్కలకు పిల్లల పేర్లు పెట్టి శ్రద్ధగా పెంచాలన్నారు. జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సూచనల మేరకు 50 శాతం మేర పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. ఇన్‌చార్జి ఆర్డీఓ ఎం.అచ్యుత్ అంబరీష్, సర్పంచ్ తిరుమల యామినిదేవి, జిల్లా అటవీ శాఖ అధికారి డి.ఆశాకిరణ్, డ్వామా ఏపీడీ పి.సుజాత, తహసీల్దార్ రావి రాంబాబు, ఎంపీడీఓ కె.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

జిల్లా ప్రత్యేక అధికారిగా బాబు



భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాల్లో ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 26 జిల్లాలకు 26 మంది ఐఏఎస్ అధికారులను నియమించగా పశ్చిమగోదావరి జిల్లా ప్రత్యేక అధికారిగా బాబును నియమించారు.

పంచారామంలో నిబంధనలు మీరి నియామకం



మాట్లాడుతున్న యుగంధర్

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరంలోని పంచారామ క్షేత్రం సోమేశ్వర జనార్దన స్వామి దేవస్థానంలో అమర్ అనే వ్యక్తికి నిబంధనలు మీరి కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పించడంలో దేవస్థాన ఇన్‌చార్జి ఈఓ కృష్ణంరాజు అవినీతి చక్రం తిప్పాడని దేవస్థాన మాజీ చైర్మన్ భర్త కోడే యుగంధర్ ఆరోపించారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇన్‌చార్జి ఈఓకు ఉద్యోగాల నియామకం, తొలగింపునకు హక్కులు లేవని, అయినా అమర్ అనే వ్యక్తికి ఉద్యోగం కోసం సిఫార్సు లేఖ రాశారన్నారు. ఎండోమెంట్ కమిషనర్ నిబంధనలు మీరి కంప్యూటర్ ఆపరేటర్‌గా నెలకు రూ.25 వేల జీతంతో ఉద్యోగం కోసం ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు. ఉద్యోగ ఉత్తర్వులు రప్పించడంలో ఇన్‌చార్జి ఈఓ లక్షల రూపాయలు తీసుకున్నారని, ఉన్నతాధికారులకు సైతం సొమ్ములు అందించారని ఆరోపించారు. అవినీతి బాగోతంపై దేవదాయశాఖ మంత్రి, కమిషనర్, లోకయుక్తకు ఫిర్యాదు చేశామని, ఉన్నతాధికారులు విచారణ చేస్తున్నారన్నారు. ఈ వ్యవహారంపై కలెక్టర్‌కి కూడా ఫిర్యాదు చేస్తానని యుగంధర్ తెలిపారు.

ఆలయ నిర్మాణంపై ఫిర్యాదు



భీమవరంలో కలెక్టరేట్ వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తున్న గూట్లపాడు గ్రామస్తులు

భీమవరం(ప్రకాశం చౌక్): గూట్లపాడులో మంచినీటి చెరువు గట్టుపై అనుమతులు లేకుండా ఆలయాన్ని నిర్మిస్తున్నారని శుక్రవారం గ్రామస్తులు జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి, డీఆర్వో ఉదయభాస్కర్, డీపీఓ విక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఆలయం నిర్మించడంతో పాటు రాత్రికి రాత్రి ఆలయంలో విగ్రహాలు పెట్టే కార్యక్రమాలు చేస్తున్నారని అన్నారు. ఆలయ నిర్మాణంపై హైకోర్టులో కేసు ఉన్నా పనులు యథేచ్ఛగా జరుగుతున్నాయని, దీనిపై తహసీల్దార్‌కు కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా ఎలాంటి స్పందన లేదన్నారు. ఆలయ నిర్మాణం చేస్తున్న ఓ వర్గానికి అధికార పార్టీ ప్రజాప్రతినిధి అండగా నిలిచారని ఆరోపించారు. ఇప్పటికే చెరువును ఆక్రమించి కొందరు ఇళ్లు నిర్మించారని, ఇప్పుడు ఆలయాన్ని అడ్డుపెట్టుకుని స్థలాల క్రయవిక్రయాలకు అధికార పార్టీ నాయకులు చూస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు.

ప్రజాప్రతినిధులు డుమ్మా

హడావుడి.. మొక్కుబడి

- తూతూమంత్రంగా 'పశ్చిమ' జిల్లాపరిషత్ సమావేశం
- కూటమి ప్రభుత్వంలో తొలి సమావేశానికి భారీగా హడావుడి
- నగరమంతా ఫ్లెక్సీల ఏర్పాటు
- ఆరుగురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు, కేంద్ర మంత్రి గైర్హాజరు
- అజెండాపై పూర్తిస్థాయిలో సాగని చర్చ



ఏలూరులో జరిగిన జెడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల. చిత్రంలో మంత్రి దుర్గేష్, జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, కలెక్టర్ వెట్రి సెల్వి

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ప్రజా ప్రతినిధులందరితోనూ మాట్లాడారు.. కేంద్ర మంత్రి నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేల వరకూ అందరినీ అడిగి ఓకే అంటేనే జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశం ఏర్పాటుచేశారు.. కట్ చేస్తే.. ఎంపీలు, కేంద్ర మంత్రులు, ఆరుగురు ఎమ్మెల్యేలు, వివిధ విభాగాల ఉన్నతాధికారులు సమావేశానికి గైర్హాజరయ్యారు. కూటమి ప్రభుత్వం కొలువుతీరిన తర్వాత తొలి సమావేశం అంటూ టీడీపీ, జనసేన శ్రేణులు ఏలూరు నగరమంతా స్వాగత ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి హడావుడి చేశారు. అయితే సమావేశం మాత్రం తూతూమంత్రంగా, మొక్కుబడిగా సాగింది. శుక్రవారం ఏలూరులోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో పశ్చిమగోదావరి జిల్లా సర్వసభ్య సమావేశాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన నిర్వహించారు.

గంటన్నర ఆలస్యంగా..

జెడ్పీ సమావేశం షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభం కావాల్సి ఉన్నా సాయంత్రం 4 గంటలకు మొదలైంది. మంత్రులు, ప్రజాప్రతినిధులు రాక ఆలస్యం కావడమే కారణం. మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్‌కుమార్, పత్సమట్ల ధర్మరాజు, బడేటి చంటి, ఆరిమిల్లి రాధాకృష్ణ, మద్దిపాటి వెంకట్రాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు సమావేశానికి హాజరయ్యారు. మిగిలిన ప్రజాప్రతినిధులంతా డుమ్మా కొట్టారు.

మధ్యలో నుంచే నిష్క్రమించి..

సమావేశంలో చర్చించడానికి వ్యవసాయ శాఖ నుంచి సామాజిక వన విభాగం వరకు పలు అంశాలతో సమగ్ర అజెండా రూపొందించారు. అయితే ఎక్కువ మంది ప్రజాప్రతినిధులు రాజకీయ ప్రసంగాలు, గత ప్రభుత్వంపై విమర్శలతో సరిపెట్టారు. కేవలం వ్యవసాయ, వైద్యారోగ్య, విద్య, గ్రామీణ నీటి సరఫరా, ఆర్అండ్‌బీ తదితర అంశాలపై కొద్దిమేర చర్చించారు. సమావేశం రాత్రి 7.30 గంటల వరకు సాగింది. ఒకరిద్దరు ఎమ్మెల్యేలు రాజకీయ ప్రసంగాలు చేసి సమావేశం మధ్యలో నుంచే వెళ్లిపోయారు. తూర్పుగోదావరి జిల్లా నుంచి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ హాజరుకాలేదు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు సమావేశానికి హాజరుకారా అంటూ చైర్‌పర్సన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

సమస్యల వెల్లువ

ఏలూరు (మెట్రో): జెడ్పీ సమావేశంలో ఎమ్మెల్యేలు ఆయా నియోజకవర్గాల్లో సమస్యలను లేవనెత్తారు. తణుకుఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ ధాన్యం సేకరణలో ఇబ్బందులను అధిగమించాలన్నారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొవ్వూరులో జలజీవన్ మిషన్ ద్వారా సురక్షిత తాగునీరు అందించాలని కోరారు. చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం, చింతలపూడి ప్రభుత్వాస్పత్రుల్లో వసతులు కల్పించాలని, నియోజకవర్గంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని అన్నారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ కొవ్వలి కొత్తపేటలో విషజ్వరాలు విజృంభిస్తున్నా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఏలూరు నుంచి చింతలపూడి, దెందులూరు నియోజకవర్గాలకు వెళ్లే తమ్మిలేరు గట్టు రోడ్డు అధ్వానంగా మారుతుందన్నారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ తన నియోజకవర్గంలో వైద్య సేవలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. సమావేశంలో పలువురు జెడ్పీటీసీలు, ఎంపీపీలు మాట్లాడారు. కలెక్టర్ వెట్రి సెల్వి, పశ్చిమగోదావరి జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి, డీఎఫ్ఓ రవీంద్ర దామ, ఉమ్మడి జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

తొమ్మిది మంది గైర్హాజరు

కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, **రాజమండ్రి, ఏలూరు** ఎంపీలు దగ్గుపాటి పురంద**రేశ్వరి, పుట్టా మ**హేష్‌కుమార్, జనసేన ఎమ్మెల్యే **బొలిశెట్టి శ్రీ**నివాస్, చిర్రి బాలరాజు, బొమ్మిడి **నాయకర్, పు**లపర్తి రామాంజనేయులు, టీడీపీ **ఎమ్మెల్యేలు పితా**ని సత్యనారాయణ, కనుమూరి **రఘురామకృష్ణం**రాజు హాజరుకాలేదు.

అధికారుల తీరు మారాలి

అధికారుల తీరు మారకుంటే చర్యలు తప్పవని, జిల్లా అభివృద్ధికి సమష్టి కృషితో ముందుకు సాగుదామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా అభివృద్ధిలో వెనుకబడి ఉందన్నారు. రానున్న సమావేశాలకు అధికారులు సమగ్ర సమాచారంలో హాజరుకావాలని సూచించారు.

సమర్థంగా పనిచేయాలి

పర్యాటక, సాంస్కృతిక శాఖామంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలన్నారు. అధికారులు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమస్యలపై అధికారుల పర్యవేక్షణ అవసరమని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన అందిస్తామన్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనలు

జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ మాట్లాడుతూ జిల్లాలో ప్రొటోకాల్ ఉల్లంఘనలు జరుగుతున్నాయని, కలెక్టర్లు దృష్టి సారించి జెడ్పీటీసీ, ఎంపీపీలకు తప్పనిసరిగా ప్రొటోకాల్ అందించాలని సూచించారు. అదే రీతిలో మంత్రులు, ఎమ్మెల్యేలు సైతం జెడ్పీటీసీలకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. కొన్ని ప్రాంతాల్లో జెడ్పీటీసీలకు, ఎంపీపీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు.

నేనెవరికీ నివేదించను: చింతమనేని



అసహనం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

సమావేశం జరుగుతుండగా అజెండాలో అంశాలను ప్రస్తావించాలని జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు సూచించడంతో తాను అజెండా అంశాలే మాట్లాడుతున్నానంటూ, మంత్రికి నివేదిస్తున్నానంటూ చింతమనేని ఆగ్రహం వ్యక్తం చేశారు. చైర్‌పర్సన్‌గా తనకు నివేదించాలని ఆమె కోరడంతో తాను ఎవరికీ నివేదించనని.. అజెండాలో అంశాలను లేవనెత్తి చర్చకు తెరతీస్తానంటూ ఆగ్రహించారు. అదే విధంగా తూతూ మంత్రంగా సమావేశాలు నిర్వహించడమేంటంటూ ప్రశ్నించారు. రానున్న రోజుల్లో సమావేశాన్ని రోజంతా నిర్వహించి సభ్యుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ట్రిపుల్‌ఐటీ.. ఈ దుస్థితి ఏంటి?

- మెస్‌ల నిర్వహణ అధ్వానం
- ఒక్క వ్యక్తికే నాలుగు మెస్‌ల అప్పగింత
- పర్యవేక్షణ శూన్యం
- విద్యార్థులకు నాసిరకం భోజనమే దిక్కు



నూజివీడు ట్రిపుల్‌ఐటీలోని మెస్‌లో తిరుగుతున్న కుక్క

నూజివీడు: అడుగడుగునా అపరిశుభ్రత.. అధ్వానంగా నిర్వహణ.. పర్యవేక్షణ లోపం.. వెరసి పూర్తి స్థాయిలో నిర్లక్ష్యం.. ఇదీ ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో మెస్‌ల నిర్వహణ తీరు. ఉడికీ ఉడకని, చివిడిన అన్నం, నీళ్లను తలపించే పప్పు, సాంబారుతో పాటు నీళ్ల పెరుగే విద్యార్థులకు దిక్కు. వీటికి తోడు వేగని గారెలు, కాలని చపాతీలను విద్యార్థులు తినలేక కాలే కడుపులతోనే పస్తులుంటున్నారు. నిత్యం నాసిరకం ఆహారం తినలేక అవస్థలు పడుతున్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో నూజివీడు క్యాంపస్‌కు చెందిన 6,600 మంది విద్యార్థులు, శ్రీకాకుళం క్యాంపస్‌కు చెందిన ఈ3, ఈ4 విద్యార్థులు 2,200 మంది కలిపి మొత్తం 8,800 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి భోజనం పెట్టేందుకు మొత్తం ఎనిమిది మెస్‌లు ఉన్నాయి. వీటిల్లో నాలుగు మెస్‌లను ఒకే వ్యక్తి వేర్వేరు పేర్లతో నిర్వహిస్తున్నారు. మెస్‌ల పర్యవేక్షణ, నాణ్యమైన భోజనం కోసం మెస్‌కు కమిటీలను నియమించారు. వీటిలో సభ్యులుగా ఫ్యాకల్టీకి అదనపు బాధ్యతలు అప్పగించినా ఈ కమిటీలు అలంకారప్రాయంగా మారాయి.

క్షీణించిన పారిశుద్ధ్యం

గతంలో మెస్‌లను రోజూ ఫినాయిల్‌తో శుభ్రం చేసేవారు. రెండు నెలలుగా మెస్‌ల నిర్వహణ అత్యంత దారుణంగా తయారైంది. ఫ్లోరింగ్, ప్లేట్లు కడిగే ప్రాంతం, విద్యార్థులు చేతులు కడుక్కునే ప్రాంతం, వంట చేసే పరిసరాలు ఇలా ఎక్కడ చూసినా పారిశుద్ధ్యం క్షీణించింది. ప్లేట్లను సరిగా శుభ్రం చేయకపోవడంతో విద్యార్థులు అనారోగ్యం పాలయ్యే అవకాశాలు ఉన్నాయి. మెస్‌లలో విద్యార్థులు భోజనం చేసేటప్పుడు కుక్కలు సైతం ఆ ప్రాంతంలో సంచరిస్తూ ఉండటం గమనార్హం. పిల్లలు తినే భోజనంలో పాకే పురుగులు, గుట్కా ప్యాకెట్లు, రాళ్లు కూడా వస్తున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. విద్యార్థుల ప్రాణాలను పణంగా పెట్టి మెస్‌లలో నాసిరకం భోజనం వడ్డిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.



మజ్జిగను తలపిస్తున్న పెరుగు



భోజనం ప్లేట్లను శుభ్రం చేయకుండా పడేసి..

నీళ్ల పప్పు.. నీళ్ల చారు.. నీళ్ల పెరుగు

విద్యార్థులకు ఉడకని అన్నం లేదా చిమిడిన అన్నం పెట్టడం సర్వసాధారణంగా మారింది. దీనికి తోడు నీళ్ల పప్పు, నీళ్ల చారు, నీళ్ల పెరుగే దిక్కు. పులుసు కూరల్లో కూడా నీళ్ల శాతమే ఎక్కువగా ఉంటోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆహారాన్ని తయారు చేసేందుకు ఉపయోగించే సరుకులన్నీ మూడు, నాలుగో క్వాలిటీకి చెందినవే కావడం విస్మయానికి గురిచేస్తోంది. సరుకులు చాలా కాలం నిల్వ ఉండటంతో గోధుమ పిండి, శనగ పిండి, కందిపప్పు, చాయ మినపప్పు, దోశలకు కలిపే బియ్యం పిండిలలో పురుగులు చేరుతున్నాయి. వాటిని సరిగా బాగుచేయకుండానే తమకు ఆహార పదార్థాలు తయారుచేసి పెడుతున్నారని విద్యార్థులు వాపోతున్నారు. వారానికి రెండు రోజులు పెట్టే చికెన్‌లో కూడా చికెన్ సూప్ కన్నా నీళ్లే ఎక్కువగా ఉంటాయని అంటున్నారు. పెరుగు గురించి అసలు చెప్పే పనే లేదని, నీళ్లు కలిపేసి మజ్జిగలా మార్చేస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు.



మెస్‌లోని వాష్ ఏరియాలో అధ్వానంగా ఇలా..



ట్రిపుల్ ఐటీలోని మెస్‌లో క్షీణించిన పారిశుద్ధ్యం

ప్రజలకు కూటమి ప్రభుత్వం పంగనామాలు

మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తణుకు అర్బన్: పచ్చి అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అని.. నీకు రూ.15 వేలు.. నీకు రూ.15 వేలు.. అంటూ ప్రజలను మభ్యపెట్టి అందలమెక్కి ఆ తర్వాత వారికే పంగనామం పెట్టారని దుయ్యబట్టారు. ఏపీలో ల్యాండ్ టైటిల్ చట్టం అమల్లో లేనప్పటికీ అప్పటి ముఖ్యమంత్రి జగన్‌పై విషప్రచారం చేయడమే కాకుండా పచ్చ పత్రికల్లో రోజుకో కథనం వండి వార్చి ప్రజలను తప్పుదోవ పట్టించారని ఎద్దేవా చేశారు. ప్రజలు ఓట్లేస్తే గెలిచారో.. మరెలా గెలిచారో కానీ ప్రజలు మాత్రం మోసపోయామని నిర్ధారణకు వచ్చారని స్పష్టం చేశారు. దేశమంతా ఈవీఎంల పైనే రచ్చ జరుగుతోందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇంతవరకు తల్లికి వందనం, ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, రైతు భరోసా వంటి హామీలపై నోరుమెదపని పరిస్థితి నెలకొందని విమర్శించారు. జగన్ తన హయాంలో కులం, మతం, పార్టీ భేదాల్లేకుండా అందరికీ మంచి చేస్తే నేడు ఏ వంక చూపి ఏది ఎగ్గొడదామా అని చూస్తున్నారని మండిపడ్డారు. రేషన్ వ్యవస్థను నీరుగారుస్తున్నారని, సార్టెక్స్ ఫ్లోరిఫైడ్ బియ్యం, కందిపప్పు, పంచదార సరుకులు ఇంటి గుమ్మంలోకే జగన్ ప్రభుత్వం అందించిందని, కానీ నేడు బియ్యం తప్ప మరే సరుకులూ ఇవ్వడం లేదని విమర్శించారు. రానున్న రోజుల్లో ప్రజలకు అండగా నిలిచేందుకు వైఎస్సార్‌సీపీ కృతనిశ్చయంతో ఉందన్నారు.

గురుకుల పాఠశాలలు ఖాళీ : జ్వరాల తీవ్రత దృష్ట్యా గురుకుల పాఠశాలలు ఖాళీ అవుతున్నాయని మాజీ మంత్రి కారుమూరి అన్నారు. విద్యార్థులకు సరైన వైద్య సౌకర్యాలు కల్పించలేదని, సత్వర వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు.

● సిరులతల్లి.. కల్పవల్లి



ద్వారకాతిరుమల చిన వెంకన్న క్షేత్రంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు శుక్రవారం నేత్రపర్వంగా జరిగాయి. ఆలయ అనివేటి మండపంలో జరిగిన వేడుకలో సుమారు 2,500 మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. ముందుగా అమ్మవారిని ప్రత్యేక వేదికపై వేంచేపు చేశారు. ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు దంపతులు పూలు, పండ్లను అందజేయగా పండితులు వ్రత వేడుకను ప్రారంభించారు. డీఈఓ బాబూరావు, ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు, సూపరింటెండెంట్లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

\- ద్వారకాతిరుమల

జెడ్పీ స్థాయీ సంఘ కమిటీల ఎన్నిక

ఏలూరు(మెట్రో): జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశంలో జెడ్పీ స్థాయీ సంఘ కమిటీల్లో నూతనంగా ఎన్నికైన సభ్యుల పేర్లను ఆమోదించారు.

- **1వ స్థాయీ సంఘ కమిటీ:** ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, ఎమ్మెల్యేలు పితాని సత్యనారాయణ (ఆచంట), చింతమనేని ప్రభాకర్ (దెందులూరు)
- **2వ స్థాయీ సంఘ కమిటీ:** నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యేలు బొమ్మిడి నాయకర్ (నరసాపురం), చిర్రి బాలరాజు (పోలవరం)
- **3వ స్థాయీ సంఘ కమిటీ:** మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు మద్దిపాటి వెంకటరాజు (గోపాలపురం), కనుమూరు రఘురామకృష్ణరాజు (ఉండి)
- **4వ స్థాయీ సంఘ కమిటీ:** ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు (భీమవరం)
- **5వ స్థాయీ కమిటీ:** ముప్పిడి వెంకటేశ్వరరావు (కొవ్వూరు), పత్సమట్ల ధర్మరాజు (ఉంగుటూరు)
- **6వ స్థాయీ సంఘ కమిటీ:** ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు సొంగా రోషన్‌కుమార్ (చింతలపూడి)
- **7వ స్థాయీ సంఘ కమిటీ:** రాజమండ్రి ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరీ, మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ (తణుకు)

క్లుప్తంగా

వినూత్న పరిష్కారాలు అన్వేషించాలి



నిట్‌లో స్మార్ట్ హ్యాకథాన్ కార్యక్రమం

తాడేపల్లిగూడెం : పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లపై వినూత్న పరిష్కారాల అన్వేషణకు విద్యార్థులు కృషి చేయాలని శుక్రవారం నిట్‌లో నిర్వహించిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌లో నిట్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ అసోసియేట్ డీన్ డాక్టర్ వి.సందీప్ కోరారు. అఖిల భారత సాంకేతిక విద్యామండలి, విద్యా మంత్రిత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సందీప్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సాంకేతిక నైపుణ్యాలు, సృజనాత్మకత ఆలోచనలను వెలికితీయడమే లక్ష్యంగా కేంద్రం ఈ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. నవంబరులో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి సంబంధించి గ్రాండ్ ఫైనల్ నిర్వహించి వినూత్న ఆలోచనలు చేసి పరిష్కారాలు చూపించిన వారిలో విజేతలను ఎంపిక చేస్తుందన్నారు. సెప్టెంబరు తొమ్మిదిన నిర్వహించే అంతర్గత పోటీ కోసం టీంలు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఆచార్యులు శ్రీఫణికృష్ణ కర్రి కో ఆర్డినేటర్‌గా, డాక్టర్ సందీప్, డాక్టర్ శంకర్‌లు మెంటర్‌గా వ్యవహరించనున్నారు.

1న నిట్‌లో యోగా పోటీలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ వెస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న నాలుగో ఇంటర్ డిస్ట్రిక్ట్ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్ షిప్ పోటీలు తాడేపల్లిగూడెం ఏపీ నిట్ యోగా హాలులో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, అసోసియేషన్ అధ్యక్షుడు ఇంజుమూరి మాధవరావు, చీఫ్ అడ్వయిజర్ కరిబండి రామకృష్ణ, సెక్రటరీ డాక్టర్ వి.శ్రీనివాస్, కోశాధికారి వెంకటేశ్వరరాజు, యోగా సాధకులు వెల్లడించారు. పట్టణంలోని యోగా సెంటర్‌లో శుక్రవారం ఈ మేరకు జిల్లా స్థాయి యోగాసన పోటీల ఇన్విటేషన్ కరపత్రాలను విడుదుల చేశారు. చీఫ్ గెస్ట్‌గా నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి, గెస్ట్‌గా డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ ఆఫ్ నిట్ డాక్టర్ జీబీ వీరేష్ కుమార్‌లు హాజరవుతారని వెల్లడించారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, సీనియర్-ఎ, సీనియర్-బి, సీనియర్-సి కేటగిరీల్లో 10-14 , 14-18, 18-28, 28-35, 35-45, 45-55 సంవత్సరాలు వరకు ఉన్న వారు పోటీల్లో పాల్గొనవచ్చునని చెప్పారు. జిల్లా స్థాయి విజేతలు సెప్టెంబర్ చివరి వారంలో రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని, వివరాలకు 83099 25889 94405 28855 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఓటర్ల జాబితాలో సవరణలు

- తాజా మార్పులు, చేర్పులకు అవకాశం
- అక్టోబర్ 18 వరకు క్షేత్రస్థాయి పరిశీలన
- అభ్యంతరాలకు డిసెంబర్ 24 వరకు గడువు



ఏలూరు(మెట్రో) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ ప్రారంభమైంది. సవరణలకు అవకాశం కల్పిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. ఆగస్టు 20న ప్రారంభమైన ఈ కార్యక్రమం అక్టోబర్ 18 వరకు కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా సంబంధిత బీఎల్‌వోలు డోర్ టు డోర్ సర్వే నిర్వహిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో కొత్త ఓటర్లను గుర్తించడం, చిరునామాలు, పేర్ల వంటి సవరణలు, మృతిచెందిన వారి వివరాలు తొలగించడం వంటి వివరాలు సేకరిస్తారు.

ఎన్నికల ముందు జాబితా ఆధారంగా..

ఏటా జనవరిలో ఎన్నికల కమిషన్ స్వచ్ఛీకరణ చేసిన ఓటర్ల జాబితా విడుదల చేస్తుంది. ఈ జాబితా విడుదలకు ముందు కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు అవసరం. ఓటరు ఇంటి నెంబరు, పోలింగ్ కేంద్రం వివరాలు, మరణించిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి వివరాలు.. ఏవైనా జాబితాలో మార్పులు ఉంటే వాటిని బీఎల్‌వోలు తెలుసుకుని మార్పులు చేస్తారు. ఇందుకు బీఎల్‌వోలు గత మేలో జరిగిన ఎన్నికలకు ముందు ఎన్నికల కమిషనర్ విడుదల చేసిన ఓటర్ల జాబితాను ప్రాథమిక నివేదికగా తీసుకుని సర్వే చేస్తారు.

అక్టోబరు 18 వరకూ పరిశీలన

బీఎల్‌వోలు అక్టోబర్ 18 వరకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయనున్నారు. ఈ క్రమంలో సవరణ చేయడానికి ఎన్నికల కమిషన్ ఫారం-6ఎ, 7, 8 వంటివి ఓటర్లకు అందజేశారు. అక్టోబర్ 18 వరకు ఈ కార్యక్రమం కొనసాగనుండగా, అక్టోబర్ 29న ఓటర్ల జాబితా ముసాయిదాను విడుదల చేస్తారు. ఈ ముసాయిదాలో ఓటర్లకు ఏవైనా అభ్యంతరాలుంటే వాటిని డిసెంబర్ 24 వరకు స్వీకరిస్తారు. మార్పు చేర్పులనంతరం తుది జాబితాను జనవరిలో ప్రకటిస్తారు. జనవరి 1, 2025 నాటికి 18 ఏళ్లు నిండే వారికి కొత్తగా ఓటు హక్కును కల్పించడానికి దరఖాస్తులు తీసుకుంటారు. ఇందుకోసం బీఎల్‌వో యాప్ రూపొందించి వివరాలు నమోదు చేస్తారు. అధికారులు ఓటర్ల నమోదు కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

ఓటర్ల వివరాలు

ఏలూరు జిల్లాలో 16.24 లక్షల మంది ఓటర్లు ఉండగా, వీరిలో 7.94 లక్షల మంది పురుష ఓటర్లు, 8.30 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఇతరులు 129 మంది ఉన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో 14.61 లక్షల మంది ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు 7.17 లక్షలు, మహిళలు 7.44 లక్షలు, ఇతరులు 74 మంది ఉన్నారు.

ఏలూరు జిల్లాలో

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్స్	మొత్తం
ఉంగుటూరు	1,01,152	1,04,177	5	2,05,,334
దెందులూరు	1,08,465	1,14,305	7	2,22,777
ఏలూరు	1,10,254	1,20,423	47	2,30,724
పోలవరం	1,22,201	1,30,380	11	2,52,592
చింతలపూడి	1,33,747	1,37,714	41	2,71,502
నూజివీడు	1,17,398	1,19,730	11	2,37,139
కైకలూరు	1,00,680	1,03,661	7	2,04,348
మొత్తం	7,93,897	8,30,390	129	16,24,416

పశ్చిమ గోదావరి జిల్లాలో

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్స్	మొత్తం
ఆచంట	88,319	90,348	1	1,78,668
పాలకొల్లు	95,079	98,293	7	1,93,379
నర్సాపురం	83,745	84,442	0	1,68,187
భీమవరం	1,22,228	1,29,023	50	2,51,301
ఉండి	1,03,414	1,13,583	2	2,22,999
తణుకు	1,13,780	1,19,296	6	2,33,082
తాడేపల్లిగూడెం	1,04,391	1,09,323	8	2,13,722
మొత్తం	7,16,956	7,44,308	74	14,61,338

హత్య కేసులో ఐదుగురి అరెస్టు



భీమడోలు పోలీసుల అదుపులో హత్య కేసు నిందితులు

భీమడోలు: మండలంలోని ఆర్జావారిగూడెంలో జరిగిన హత్య కేసులో ఐదుగురిని అరెస్ట్ చేసి భీమడోలు కోర్టులో హాజరుపర్చారు. సీఐ బీబీ రవికుమార్ శుక్రవారం కేసు వివరాలు వెల్లడించారు. ఈ నెల 28న ఆర్జావారిగూడెంలో ఆస్తి తగాదా గొడవలో చేబత్తిన కృష్ణ మృతి చెందగా, అతని మేనకోడలు పూజారాణి తీవ్ర గాయాలతో ఏలూరు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. హత్యకు పాల్పడిన తడపల వెంకటేశ్వరరావుతో పాటు తడపల దుర్గారావు, తడపల వీరయ్య, తడపల ప్రశాంత్, తడపల వివేక్‌ను అరెస్ట్ చేశామన్నారు. తడపల వెంకటేశ్వరరావు, దుర్గారావు, వీరయ్య అన్నదమ్ములు. అరుంధతీ కాలనీలో తడపల దుర్గారావు, అతని కొడుకు ప్రశాంత్, ఆర్జావారిగూడెంలో తడపల వెంకటేశ్వరరావు, అతని కొడుకు వివేక్, వీరయ్య ఉంటున్నారు. 30 ఏళ్ల క్రితం దుర్గారావుకు నాగమణితో ప్రేమ వివాహం జరిగింది. వారికి ప్రశాంత్, పూజారాణి సంతానం. దుర్గారావుకు తన భార్య తరపున ఆర్జావారిగూడెంలో ఇంటి స్థలం వచ్చింది. ఆ ఇంటి స్థలం విషయంలో దుర్గారావుకు అతని కూతురు పూజారాణికి మధ్య కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 28న ఉదయం ఐదుగురు ముద్దాయిలు పూజారాణి, ఆమె మేనమామ చేబత్తిన కృష్ణతో గొడవ పడ్డారు. తడపల వెంకటేశ్వరరావు తన వద్ద ఉన్న కత్తితో కృష్ణ మెడపై, పూజారాణి తలపై నరికాడు. దీంతో ఇద్దరు స్పృహ తప్పి పడిపోగా అక్కడ నుంచి నిందితులు వెళ్లిపోయారు. తీవ్రంగా గాయపడిన చేబత్తిన కృష్ణ, అతని మేనకోడలిని ఏలూరు ఆసుపత్రికి తరలిస్తుండగా.. మధ్యలో కృష్ణ మృతి చెందాడు. కృష్ణ మృతి చెందాడన్న విషయం తెలుసుకున్న ఐదుగురు ముద్దాయిలు గ్రామం నుంచి పరారయ్యారు. లారీలో పారిపోయేందుకు అంబర్‌పేట శివారు క్వారీ గోతుల వద్ద ఉండగా వారిని సీఐ రవికమార్ గురువారం సాయంత్రం పట్టుకుని అరెస్ట్ చేసారు. వారిని భీమడోలు కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

పెనుమంత్ర ఎంపీపీకి తప్పిన ప్రమాదం

దగ్ధమైన ఎలక్ట్రిక్ కారు



బ్రాహ్మణ చెరువులో అగ్నికి ఆహుతవుతున్న ఎలక్ట్రిక్ కారు

పెనుమంత్ర : మండలంలోని బ్రాహ్మణచెరువు శివారు కొండాలమ్మ ఆలయం వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఎలక్ట్రిక్ కారు దగ్ధం కాగా.. ప్రమాదంలో పెనుమంత్ర ఎంపీపీ కర్రి వెంకట నారాయణ రెడ్డి(వాసు) త్రుటిలో తప్పించుకొన్నారు. ఎంపీపీ వాసురెడ్డి టాటా ఎలక్ట్రిక్ కారులో గురువారం పాలకొల్లు వెళ్లి.. శుక్రవారం తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో స్వగ్రామం పెనుమంత్ర మండలం ఎస్.ఇల్లింద్రపర్రుకు వెళ్తున్నారు. కొండాలమ్మ ఆలయ సమీపంలో ఒక్కసారిగా కారు నుంచి పొగలు వచ్చి మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన వాసురెడ్డి కారు నుంచి బయటపడ్డారు. సుమారు రూ.17 లక్షల విలువైన కారు దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. డోరు లాక్ ఇబ్బంది పెట్టకుండా ఓపెన్ అవడంతో ఎంపీపీ ప్రాణాలతో బయటపడ్డారు. పొగలు రావడం గమనించిన వెంటనే కారు ఆపి బయటకు రావడంతో ప్రాణాలతో బయట పడ్డారని.. ఏ మాత్రం ఆలస్యం జరిగినా పెనుప్రమాదం జరిగి ఉండేదంటున్నారు. ఇంత వరకూ కేవలం ఎలక్ట్రిక్ బైక్‌లు మాత్రమే దగ్ధమైన సంఘటనలు ఉన్నాయి. ఇపుడు ఏకంగా కారు దగ్ధమవడంతో జనం భయపడుతున్నారు.

డెంగీతో చిన్నారి మృతి



గూనా నిత్యశ్రీ పద్మ(ఫైల్)

అత్తిలి : డెంగీ జ్వరం జిల్లాను వణికిస్తోంది. డెంగీతో అత్తిలిలో శుక్రవారం రాత్రి గూనా నిత్యశ్రీపద్మ(6) మృతి చెందింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం అత్తిలి గ్రామానికి చెందిన గూనా సుబ్బారావు, భవాని దంపతుల కుమార్తె నిత్యశ్రీపద్మ అత్తిలి మదర్ మెర్సిల్లా స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతోంది. మూడు రోజుల క్రితం చిన్నారికి జ్వరం రావడంతో తణుకులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా డెంగీ ఫీవర్‌గా నిర్ధారించి వైద్యం అందించారు. అయితే గురువారం బాలిక పరిస్థితి విషమించడంతో విజయవాడలో ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించామన్నారు. అక్కడ వైద్య సేవలు పొందుతూ బాలిక శుక్రవారం రాత్రి మృతిచెందింది.

రాజకీయ వేధింపులకే కూటమి పరిమితం



కుంచెలపల్లి విన్స్టన్ బాబు

పాలకొల్లు అర్బన్: కూటమి ప్రభుత్వం రాజకీయ వేధింపులకు పరిమితమైందని, ఆడ పిల్లల సంరక్షణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచెలపల్లి విన్స్టన్‌బాబు విమర్శించారు. హాస్టల్ వాష్‌రూంలో కెమెరాలు పెట్టి ఆ పుటేజీను బయటకు పంపుతున్నారంటే ఆడ పిల్లల రక్షణ పట్ల కూటమి ప్రభుత్వం ఎంత బాధ్యత రాహిత్యంగా వ్యవహరిస్తుందో అర్థమవుతుందన్నారు. హోం మంత్రి అనిత ప్రెస్ మీట్‌లు పెట్టి మాజీ సీఎం జగన్‌పై బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. కూటమి అధికారంలోకి వచ్చాక మహిళలకు, విద్యార్థినులకు రక్షణ కరువైందన్నారు. జగన్ మోహన్‌రెడ్డి దిశ యాప్‌తో మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారన్నారు. మంత్రి లోకేష్ రాష్ట్రంలో మహిళలపై, విద్యార్థులపై జరుగుతున్న దాడులపై దృష్టి పెట్టాలని హితవు చెప్పారు. మంత్రులు చంద్రబాబుని ప్రశ్నించే ధైర్యం చేయలేక జగన్‌ను విమర్శిస్తూ సుఖంగా నిద్రపోతున్నారన్నారు.

ఉద్యానంలో సాంకేతికతతో సత్ఫలితాలు



ఉద్యాన విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న వీసీ. కె.గోపాల్ తదితరులు

తాడేపల్లిగూడెం: ఉద్యాన రంగంలో సాంకేతికత పెరిగిందని, దానిని సద్వినియోగం చేసుకొని సత్ఫలితాలు సాధించాలని డాక్టర్ వైఎస్‌ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ కోరారు. ఉద్యాన రంగంలో సుస్థిరత కోసం సాంకేతిక ప్రమేయం అనే అంశంపై జరుగుతున్న శిక్షణా కార్యక్రమం శుక్రవారం ముగిసింది. అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ ఉద్యాన రంగంలో వస్తున్న మార్పులు, విలువ ఆధారిత ఉత్పత్తుల ప్రాధాన్యత, సాంకేతికతను అందిపుచ్చుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఐసీఏఆర్, ఎన్ఏహెచ్ఈపీ, ఐఏఎస్ఆర్ఐ శాస్త్రవేత్తలు, ఇన్వెస్టిగేటర్లు డాక్టర్ అన్షు భరద్వాజ్, డాక్టర్ సుదీప్ మర్హా నిపుణులుగా వ్యవహరించారు. మొక్కల వైరస్ లక్షణాల ఆధారంగా వర్గీకరణ, మొక్కల వైరస్ ప్రసరణ, ప్లాంట్ పెథాలజీ, ఉద్యాన పంటల అభివృద్ధికి బయోటెక్నాలజీ విధానాల గురించి వివరించారు. కె.జ్యోతిర్మయి మాధవి, అరుణకుమారి, జి.లక్ష్మీదేవిలు ప్రసంగించారు. ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఏవీడీ దొరాజీరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితులకు పరిహారం ఎప్పుడు?

ఏలూరు (టూటౌన్): పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సంగతేంటని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సూటిగా ప్రశ్నించింది. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి ఏ రవి శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మానానికి రూ.12 వేల కోట్లు మంజూరైనట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని.. నిధులు విడుదల చేయడం హర్షణీయమని, ఆ ప్రాజెక్టు కోసం త్యాగాలు చేసిన నిర్వాసితులకు పునరావాసం ఏర్పాట్లకు నిధుల సంగతేంటని ప్రశ్నించారు. ముందు నిర్వాసితులకు పునరావాసం కల్పించాకే ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని నిబంధనలు చెబుతున్నాయన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తామని, అక్కడ అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని ప్రకటనలు చేయటమే తప్ప అటు పార్లమెంటు, ఇటు అసెంబ్లీలో మాట్లాడిన పరిస్థితులు లేవన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు మోసం చేస్తున్నారే తప్ప వారికి న్యాయం జరిగేలా చర్యలు లేవని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయిస్తూనే తక్షణమే నిర్వాసితులకు పునరావాస ఏర్పాట్లకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

14న జాతీయ లోక్ అదాలత్



ప్యానల్ లాయర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ జిల్లా కార్యదర్శి కె.రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): వచ్చే నెల 14న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా కోర్టులున్న అన్ని ప్రదేశాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. స్థానిక జిల్లా న్యాయ సేవాసదన్ భవన్‌లో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ప్యానల్ లాయర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ ఉచిత న్యాయ సాయం అందించిన కేసుల పురోగతిపై చర్చించారు. కేసుల విచారణకు ప్యానల్ లాయర్లు సంబంధిత కోర్టులకు సహకరించాలని సూచించారు. వచ్చే నెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్, రాజీ యోగ్యమైన క్రిమినల్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

9న యోగాసన పోటీలు



యోగాసన పోటీల కరపత్రాలు విడుదల చేస్తున్న యోగాసన భారత్ సంస్థ ప్రతినిధులు

ఏలూరు(ఆర్ఆర్‌పేట): సెప్టెంబర్ 9న జిల్లా స్థాయిలో యోగాసన పోటీలు నిర్వహించనున్నట్లు ఏలూరు జిల్లా యోగాసన భారత్ సంస్థ జిల్లా అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక గో సంరక్షణ సమితి కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యోగా ద్వారా ఆరోగ్య పరిరక్షణ, మానసిక ప్రశాంతత లభిస్తుందని, భారతదేశం ఈ విషయంలో ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచిందన్నారు. సెప్టెంబర్ 9న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఈ పోటీలు ఏలూరు సీతారామ్ భర్తియా కల్యాణ మండపంలో జరుగుతాయన్నారు. అన్ని విభాగాల వారికి ట్రెడిషనల్, ఆర్టిస్టిక్ సోలో, ఆర్టిస్టిక్ పెయిర్, రిథమిక్ పెయిర్, ఆర్టిస్టిక్ గ్రూప్ అంశాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. సంస్థ కార్యదర్శి ఎం.మల్లిఖార్జున రావు మాట్లాడుతూ యోగాపై విద్యార్థుల్లో ఆసక్తి కలిగించడానికి ఈ యోగా పోటీలు ఉపయోగపడతాయన్నారు. పోటీల్లో పాల్గొనాలనుకునే వారు 9848611744, 9490734033, 8309415417 నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

వివాహిత ఆత్మహత్య

ద్వారకాతిరుమల: స్థానిక వసంత్‌నగర్ కాలనీలో గురువారం రాత్రి ఒక వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ కలహాలే ఈ ఘటనకు కారణంగా తెలుస్తోంది. దీనిపై ఫిర్యాదు లేకపోవడంతో పోలీసు కేసు నమోదు కాలేదు.

బంగారం చోరీ

ఏలూరు టౌన్: ఏలూరు నగర శివారు వట్లూరు ప్రాంతంలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వట్లూరు గ్రామం శౌరిపురంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళాలు పగులగొట్టి చోరీ చేశారు. శౌరిపురానికి చెందిన అత్కూరు అన్నమ్మ ఈ నెల 22న వ్యక్తిగత పనులపై ఊరెళ్లి.. 25న తిరిగి రాగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోని 3 కాసుల బంగారు అభరణాలు అపహరించారు. త్రీ టౌన్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు.

మొలక శాతం తెలుసుకోండి ఇలా..



చింతలపూడి : రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుని శాస్త్రీయ పద్ధతిలో పంట సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ సహాయ సంచాలకుడు బి.నాగకుమార్ సూచించారు. మెట్ట ప్రాంతంలో అధికంగా వరి, మొక్కజొన్న, వేరుశెనగ, పత్తి పంటలను రైతులు పండిస్తుంటారు. విత్తన ఎంపిక నుంచి మేలైన సస్యరక్షణతో దిగుబడులు ఎలా పెంచుకోవచ్చో వివరించారు.

మొలక శాతం పెంచడం ఎలా?

విత్తనం మొలకెత్తి మొక్కగా పెరగడం దాని సజీవత్వంపై ఆధారపడి ఉంటుంది. విత్తన సజీవత్వాన్ని తెలుసుకోవాలంటే విత్తనాలను ఆరు గంటలసేపు నానబెట్టి పప్పు ధాన్యాలయితే బీజ కవచం తొలగించి 0.1 శాతం టెట్రాజోలియం ద్రావణంలో అరగంటసేపు, ధాన్యపు, చిరు ధాన్యపు గింజలయితే బీజ కవచం తొలగించి లేదా సన్నని రంధ్రం చేసి 3 గంటల వరకు చీకటి ప్రదేశంలో ఉంచాలి. తర్వాత విత్తనాలను మధ్యకు కోసి పరీక్షించాలి. విత్తనం ఎరుపు రంగుకు మారితే విత్తనం జీవం కలిగి ఉన్నట్లు.. కొన్ని సందర్భాల్లో విత్తనాలు జీవం కలిగి ఉన్నా అవి మొలకెత్తవు. ఈ స్థితిని నిద్రావస్థ అంటారు.

మొలక శాతం : ఎత్తు అంచు గల స్టీలు ప్లేటు గాని, మట్టి మూకుడు కాని ఇసుకతో నింపి, దానికి తగు మోతాదులో నీరు పోసి 100 విత్తనాలను లెక్కించి వాటిపై ఇసుకను కప్పాలి. రోజూ నీరు చిలకరిస్తుండాలి. విత్తన రకాన్ని బట్టి 3-4 రోజుల నుంచి 7-8 రోజులలో మొలక కనిపిస్తుంది. ఆ తరువాత మొలకెత్తిన విత్తనాలను లెక్కిస్తే మొలక శాతం తెలుస్తుంది. విత్తనం టెట్రాజోలియం పరీక్షలో జీవం ఉన్నదిగా తేలి, మొలక శాతం తక్కువగా ఉంటే ఆ విత్తనం నిద్రావస్థలో ఉన్నట్లు భావించాలి.

నిద్రావస్థ తొలగించే పద్ధతులు

వరి: వరి విత్తనాన్ని 24 గంటల పాటు 50 సెల్సియస్ వద్ద నీటిలో నానబెడితే నిద్రావస్థ తొలగిపోతుంది. లేదా లీటరు నీటికి 7 మిల్లీలీటర్ల నత్రికామ్లం కలిపి ఆ ద్రావణంలో 12 గంటలు నానబెడితే నిద్రావస్థ తొలగుతుంది.

పత్తి విత్తనాలు : విత్తనపు కవచం విత్తనాలు మొలకెత్తడానికి అవరోధంగా ఉన్నప్పుడు విత్తన కవచాన్ని రసాయనాల ద్వారా.. విత్తనాన్ని రుద్దడం ద్వారా నిద్రావస్థ నుంచి తొలగించవచ్చు. పత్తి విత్తనాలైతే గాఢ సల్ఫ్యూరిక్ ఆమ్లంతో శుద్ధి చేయడం ద్వార నిద్రావస్థ తొలగించవచ్చు. కొన్ని రకాల విత్తనాలను వేడి నీటిలో 80 డిగ్రీల సెంటిగ్రేడ్ వద్ద 3 నిమిషాలు ఉంచితే మొలక శాతం పెరుగుతుంది.

వేరుశెనగ విత్తనాలు : వేరుశెకనగ విత్తనాలలో ఎథిరిల్ -100 పీపీఎం లేక జిబ్బరిల్లిక్ యాసిడ్ 10 పీపీఎం విత్తనాలను దాదాపు 6 గంటల పాటు నానబెట్టి మొలకశాతం పెంచవచ్చు. కొన్ని రకాల విత్తనాలను పొటాషియం నైట్రేట్, థయో యూరియా వాడి నిద్రావస్థను తొలగించవచ్చు.

మద్యం మత్తులో వ్యక్తి హత్య

ముసునూరు : ఆ ముగ్గురి పేరు రంగారావే.. మద్యం మత్తులో ఒకరితో ఒకరు గొడవపడ్డారు. ఇంతలో ఒక రంగారావు.. మరో రంగారావుని తలపై కొట్టగా అతను అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన ముసునూరు మండలం గోపవరంలో జరిగింది. ఏఎస్ఐ ఫణి భూషణరావు తెలిపిన వివరాల ప్రకారం.. గోపవరానికి చెందిన యలమర్తి రంగారావు(62), తిరువీధి రంగారావు, కొండ్రుపాటి రంగారావు గురువారం రాత్రి గ్రామంలో కలిసి మద్యం సేవించారు. యలమర్తి రంగారావు, తిరువీధి రంగారావు మధ్య వివాదం మొదలైంది. వారు ఇళ్లకు చేరుకున్నాక మళ్లీ గొడవపడ్డారు. కొండ్రుపాటి రంగారావు కుమారుడు కిరణ్ తన తండ్రిని తీసుకుని వెళ్ళిపోయాడు. తిరువీధి రంగారావు, యలమర్తి రంగారావుతో మళ్లీ వాదనకు దిగాడు. తిరువీధి రంగారావు కర్ర తీసుకుని యలమర్తి రంగారావు తలమీద కొట్టాడు. యలమర్తి రంగారావు కుప్ప కూలిపోయాడు. నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

క్లుప్తంగా

'గూడెం'లో ఎడతెరిపి లేని వర్షం



పట్టణంలో కురుస్తున్న వర్షంలోనే రాకపోకలు సాగిస్తున్న ప్రజలు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. అడపా దడపా వర్షం ఆగినప్పటికీ మరలా ఊపందుకోవడంతో రోడ్లన్నీ తడిసి ముద్దయ్యాయి. పాతూరు, మసీదు సెంటర్, కేఎన్ రోడ్డు, కోతిబొమ్మ సెంటర్ తదితర లోతట్టు ప్రాంతాల్లోని రహదారుల పైకి వర్షపు నీరు చేరింది. పట్టణంలోని డ్రెయిన్లు నిండు కుండలా ప్రవహించాయి.

దివ్యాంగుల అభివృద్ధికి కృషి చేద్దాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): భవిత సెంటర్ దివ్యాంగుల అభివృద్ధికి కృషి చేద్దామని దాత గోపి అన్నారు. స్థానిక భవిత శిక్షణ కేంద్రంలో దివ్యాంగుల పిల్లలకు దాత సాయంతో అన్నదానం, బిస్కెట్స్, చాక్లెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా వక్త మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లలను ప్రోత్సహించి, సహాయ సహకారాలు అందించడం ద్వారా చదువుకునేందుకు సహకరిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్కే బాలీశ్వరయ్య, ఎం.చంద్రకుమారి, నాగలక్ష్మి, దివ్యాంగుల పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



సేవా కార్యక్రమంలో పాల్గొన్న డైమండ్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. డైమండ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం వృద్ధాశ్రమంలో సేవలు అందించారు. వంద మంది వృద్ధులకు అన్నదానం, వస్త్రదానం, దుప్పట్లు, క్యారేజీలు, వృద్ధులకు అవసరమైన వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గవర్నర్ కాకర్ల వేణుబాబు, జోన్‌ఛైర్‌పర్సన్ బండి వెంకటేశ్వరరావు, ఆకుల నాగ వెంకట సుబ్రహ్మణ్యం, కర్రి సురేష్ కుమార్, పేరిచర్ల మురళీకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.


శిరస్త్రాణంతో ప్రాణాలకు రక్ష



హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: హెల్మెట్ ధరించండి ప్రాణాలు కాపాడుకోండి అంటూ పట్టణ ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం పోలీసు ఐలాండ్ సెంటర్‌లో అవగాహన కార్యక్రమం చేపట్టారు. నీ మీద మీ జీవితమే కాదు. మీ కుటుంబసభ్యుల జీవితాలు ఆధారపడి ఉన్నాయనే సంగతిని గుర్తుంచుకోవాలని ట్రాఫిక్ ఎస్ఐ కొండలరావు అన్నారు. ఈ సందర్భంగా పలువురు వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీరు నిల్వ లేకుండా చూడాలి



తాళ్లపాలెం గ్రామంలో నిల్వ ఉన్న నీటిని తోడిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందుతాయని మాధవరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఏవీ.వెంకటేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని తాళ్లపాలెం గ్రామంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ నిల్వ ఉన్న ఆహార పదార్థాలను తినరాదని సూచించారు. వేడిగా ఉన్న ఆహారాన్ని భుజించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టి.సింధు, ఎంపీహెచ్ఈవో జి.వెంకటేశ్వరరావు, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఉండి: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఉండి ఎస్ఐ నసీరుల్లా అన్నారు. శుక్రవారం ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని ఐటీఐలో గంజాయి, సైబర్ నేరాలు, ఉమెన్ సేఫ్టీ, ట్రాఫిక్ రూల్స్ వంటి పలు విషయాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఐటీఐ కాలేజ్ ప్రిన్సిపల్ వీ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

రోజంతా ముసురు..!

- తణుకులో తెరిపివ్వని వాన
- అస్తవ్యస్తంగా మారిన జనజీవనం



ముసురు కారణంగా తణుకులో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం

తణుకు: రోజంతా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో తణుకు తడిసి ముద్దయింది. గురువారం ఉదయం మొదలైన వర్షం శుక్రవారం కూడా కొనసాగింది. రాత్రి, పగలు అనే తేడా లేకుండా కురిసిన వర్షానికి జనజీవనం చాలా వరకు ఇంటికే పరిమితమైంది. కాలు బయటపెట్టే వీలు లేకుండా రోజంతా వాన కురవడంతో జనం అవస్థల పాలయ్యారు. ముఖ్యంగా స్కూల్‌కు వెళ్లే చిన్నారులు, కళాశాల విద్యార్థులు, ఉద్యోగులు వర్షంతో ఇబ్బంది పడ్డారు. అత్యవసర పనులపై బయటకు వచ్చిన వారు గొడుగులు, రెయిన్ కోట్లు ధరించి పనులు చక్కబెట్టు కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వ్యాపారాలు సాగక చిరు వ్యాపారులు, తోపుడుబళ్ల వ్యాపారులు ఉసూరుమన్నారు. ఏకధాటిగా కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. డ్రెయిన్లు వర్షపు నీరు పొంగి ప్రవహించింది. వర్షం, గాలులు కారణంగా పలు ప్రాంతాల్లో చెట్లు కూలిపోయాయి.

అల్పపీడనం ప్రభావం...

అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. గురువారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షం శుక్రవారం సైతం తణుకులోని ఎడతెరిపి లేని వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు, పల్లపు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. ముఖ్యంగా రాష్ట్రపతిరోడ్డులోని పలు ప్రాంతాల్లో డ్రెయినేజీలు పొంగి ప్రవహిస్తుండటంతో ప్రధాన రోడ్లు చెరువులను తలపించాయి. ప్రధానంగా బ్యాంకు కాలనీ, ఎన్జీవో కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, ఇరగవరం కాలనీల్లో రోడ్లపై వర్షపు నీరు చేరుకుంది.ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు విద్యార్థులు, ఉద్యోగులు, చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

మానవత సంస్థ సేవలు అభినందనీయం



తణుకు ఆర్టీసీ డిపో ఆవరణలో మొక్కలు నాటుతున్న మానవత సంస్థ ప్రతినిధులు

తణుకు అర్బన్: మానవాళి మనుగడకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని తణుకు ఆర్టీసీ డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ అన్నారు. మానవత సంస్థ ఆధ్వర్యంలో ప్రతినిధి కఠారి శారదాదేవి అధ్యక్షతన శుక్రవారం తణుకు ఆర్టీసీ డిపో ఆవరణలో 50 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గిరిధర్‌కుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం మంచి పరిణామమన్నారు. మొక్కలు నాటిన అనంతరం మల్లిన అరుణసారధి ఇచ్చిన విరాళంతో సమకూర్చిన సేఫ్టీ ట్రీగార్డ్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మానవత జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, మండల చైర్మన్ బోయపాటి రామలక్ష్మి, కన్వీనర్ ఎస్వీ సతీష్‌బాబు, కార్యదర్శి బి.రామకాశీ, కోశాధికారి అక్కిన కాశీ, కె.విశ్వనాథరాజు, ఒబిలిశెట్టి మురళి హరనాథ్, కొల్లేపర సత్యనారాయణ, డిపో సిబ్బంది, మానవత సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

తణుకు టౌన్: తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాలలో బీఎస్సీ ఆఖరు సంవత్సరం చదువుతున్న విద్యార్థినికి తణుకు మానతవ సంస్థ ఆధ్వర్యంలో రూ. 10 వేలను ఆర్థిక సహాయం అందజేశారు. శుక్రవారం తణుకు రోటరీ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినీ డీ జోహారికకు తన కళాశాల ఫీజుల నిమిత్తం మానవత సంస్థ తరపున రూ.10 వేల చెక్కును అందజేసినట్లు మానవత సంస్థ అధ్యక్షురాలు కఠారి శారదాదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, కార్యదర్శి బీ రామకాశీ, కోశాదికారి అక్కిన కాశీ, శివనారాయణ, కె కాశీవిశ్వనాథరాజు, కొర్లేపర సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం, శేషుబాబు, ఆలపాటి సుబ్బారావు పాల్గొన్నారు.

కరుణించు తల్లి.. భక్త కల్పవల్లి

ఘనంగా వరలక్ష్మి వ్రతాలు



పెంటపాడు: ప్రత్యేక అలంకరణలో వై. జంక్షన్ ప్రత్తిపాడు కనదుర్గమ్మ



పెంటపాడు: కనకదుర్గమ్మ గుడిలో వరలక్ష్మి వ్రతాలలో పాల్గొన్న మహిళలు



తాడేపల్లిగూడెం రూరల్: ముత్యాలమ్మతల్లి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహిస్తున్న మహిళలు

పెంటపాడు: మండలంలో శ్రావణమాసం పురస్కరించుకొని శుక్రవారం ప్రత్తిపాడు వై. జంక్షన్‌లోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద శ్రావణలక్ష్మి వ్రతాలు ఘనంగా జరిగాయి. హిందూ ధర్మపరిరక్షణ ట్రస్టు, కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో జరిగిన ఈ వ్రతాలకు చుట్టుపక్కల 15 గ్రామాలతో పాటు, నిడమర్రు, గణపవరం మండలాల నుండిచి 250 మంది మహిళలు పాల్గొన్నారు. ఆలయ ఈవో శ్రీదేవి ఆధ్వర్యంలో ప్రధానఅర్చకులు కొత్తలంక శివసత్యనారాయణ మహిళలతో విఘ్నేశ్వర పూజ, కలశప్రాణప్రతిష్ఠ, లక్ష్మీపూజ, షోడసోపచారపూజలు, వరలక్ష్మి వ్రతాలను మహిళలతో చేయించారు. ప్రత్యేక పూజా సామగ్రిని భక్తులకు ఆలయ సిబ్బంది అందజేశారు. ప్రత్తిపాడుకు చెందిన సత్య విజయఫంక్షన్ హాల్ అధినేత వీర్ల సత్యనారాయణ, విజయలక్ష్మి దంపతులు సహకారంతో అన్నసమారాధన చేశారు. ఏలూరు జిల్లా తాడినాడకు చెందిన ముదుండి శ్రీహరిరాజు, వెంకటలక్ష్మి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూలతో అలంకరించారు. గూడెంకు చెందిన ముప్పర్తిపాడు క్లాత్‌షోరూం అధినేతలు వయ్యారి నాగేశ్వరరావు, శ్రీనివాసరావులు పూజల్లో పాల్గొన్న మహిళలు జాకెట్ ముక్కలు అందజేశారు. ప్రత్తిపాడుకు చెందిన మురుగన్ ట్రాన్స్‌ఫోర్స్ అధినేత బత్తుల పాండురంగారావు అమ్మవారి ఫోటోలు అందజేశారు. జువ్వలపాలెంకు చెందిన కర్రి చంద్రారెడ్డి, పద్మ దంపతులు శ్రావణలక్ష్మి వ్రతం చేసిన మహిళలకు గాజులు అందజేశారు.

ముత్యాలమ్మ ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలంబాపురం శ్రీముత్యాలమ్మవారి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. స్థానికులతో పాటు పరిసరాల నుంచి మహిళలు వచ్చి వరలక్ష్మీ దేవికి వ్రతాలు జరిపారు. ఆలయ అర్చకులు ఉండి సుబ్రహ్మణ్యం బ్రహ్మత్వంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల హరేరాంప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ హరిబాబు పర్యవేక్షణలో వరలక్ష్మీ వ్రతాలు జరిగాయి.

ఘనంగా అన్న సమారాధన

అత్తిలి: మండలంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా శ్రీఐశ్వర్యదుర్గ అమ్మవారి ఆలయం వద్ద అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు జరిపారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలుచేశారు. దాత పోలిశెట్టి చంటి ఆర్థిక సహకారంతో అన్నదానం జరిపారు.

శ్మశాన వాటికకు ఫ్రీజర్ బహూకరణ



నవాబుపాలెంలో శ్మశాన వాటికకు ఫ్రీజర్‌ను అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నవాబుపాలెం గ్రామంలోని హిందూ శ్మశాన వాటికకు ఆర్ అండ్ బీ రిటైర్డ్ ఇంజనీర్ స్వర్గీయ బండి గాంధీ కుటుంబ సభ్యులు మార్చురీ ఫ్రీజర్‌ను శుక్రవారం అందజేశారు. పేదలు మృతి చెందిన సమయంలో మృతదేహాన్ని శ్మశాన వాటికకు తీసుకెళ్లడానికి ఉపకరిస్తుందని గాంధీ కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

తణుకు: తణుకు ఎస్ఎన్‌వీటీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లీషు బోధించేందుకు అతిథి ఫ్యాకల్టీ ప్రాతిపదికన జూనియర్ లెక్చరర్‌గా పని చేసేందుకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు కోరారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఎంఏ ఇంగ్లీషులో యాభైశాతం మార్కులకు తక్కువ కాకుండా ఉండాలన్నారు. సెప్టెంబరు 3 లోపు కళాశాల కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

ఆర్టీసీ బస్సు షెల్టర్లు నిర్మించండి

- రోడ్డుపై ప్రయాణికులు వేచి ఉండాల్సిన దుస్థితి
- ఎండకు, వానకు అవస్థలు
- బస్సు వచ్చినప్పుడు నిత్యం ట్రాఫిక్ సమస్య



ఏలూరు రోడ్డులో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు



ఎన్టీఆర్ జంక్షన్ వద్ద బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఎస్ ఆర్టీసీ బస్సులు ఆగేందుకు అనువైన బస్సు షెల్టర్లు పట్టణంలో లేకపోవడంతో ప్రయాణికులు పలు ఇబ్బందులు పడుతున్నారు. తాడేపల్లిగూడెం బస్సు కాంప్లెక్స్ నుంచి ఏలూరు, భీమవరం, తణుకు, నల్లజర్ల వైపు బస్సు రూట్లు ఉన్నాయి. బస్సు కాంప్లెక్స్ నుంచి తాలూకా ఆఫీస్ సెంటర్, శేషమహల్ రోడ్డు ప్రారంభంలో ఎన్టీఆర్ జంక్షన్, ఓవర్ బ్రిడ్జి మీదుగా ప్రయాణించి తణుకు వైపు వెళ్లే బస్సు స్టాప్, భీమవరం వైపు వెళ్లే బస్సు స్టాప్, ఏలూరు వైపు వెళ్లే బస్సు స్టాప్‌లు ఉన్నాయి. నల్లజర్ల వైపు గొల్లగూడెం సెంటర్, హౌసింగ్‌బోర్డు సెంటర్, మాగంటి కల్యాణ మండపం సెంటర్లు ఉన్నాయి. తణుకు వైపు వెళ్లే బస్సులు కోసం బస్సు షెల్టర్ కట్టించారు. హౌసింగ్ బోర్డు సెంటర్ వద్ద బస్సు షెల్టర్ ఉన్నప్పటికి అది కార్నర్‌లో ఉండటంతో నిరుపయోగంగా మారింది. ఆ బస్సు షెల్టర్‌ను ఎవరూ ఉపయోగించడం లేదు.

షెల్టర్లు లేక ప్రయాణికులు ఇబ్బందులు

పట్టణంలో ప్రధాన సెంటర్లు తాలూకా ఆఫీస్ సెంటర్, ఎన్టీఆర్ జంక్షన్, భీమవరం వైపు ప్రభాత్ టాకీస్ సెంటర్, ఏలూరు వైపు మోడ్రన్ కేఫ్ సెంటర్ వద్ద బస్సులు నిలపుదల కోసం షెల్టర్లు లేవు. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాలు పడిన, ఎండలు కాసిన ప్రయాణీకులు తిప్పలు అంతా ఇంతా కాదు. షెల్టర్లు లేకపోవడంతో బస్సులు కోసం రోడ్డు మీదే నిలబడి ఎదురు చూస్తున్నారు. వర్షాకాలం షెల్టర్ లేక షాపులు వద్ద నిలబడటం, లేని పక్షంలో రోడ్డుపైనే ఉంటున్నారు. వేసవి కాలం సైతం ఇదే పరిస్థితి నెలకొని ఉంటుంది. ప్రయాణికులను ఎక్కించేందుకు బస్సు రోడ్డుపై ఆగినప్పుడు దాని వెనుక ఉన్న వాహనాలు వారు ముందుకు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో పలు చోట్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ప్రయాణికులు బస్సు ఎక్కే వరకు ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోతున్నాయి. తాలూకా ఆఫీస్ సెంటర్, ఎన్టీఆర్ జంక్షన్, భీమవరం వైపు, ఏలూరు వైపు బస్సు షెల్టర్లు నిర్మాణం చేపట్టి బస్సులను రోడ్డు మీద నిలిపి ఉంచకుండా పక్కకు తీసే విధంగా ఏర్పాట్లు చేస్తే ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని ప్రజలు చెబుతున్నారు.

ప్రయాణికుల అవస్థలు తగ్గుతాయి



పట్టణంలో బస్సు షెల్టర్లు నిర్మించడం ద్వారా ప్రయాణికులు బస్సుల కోసం రోడ్డు మీద పడిగాపులు పడనవసరం లేదు. బస్సులు వచ్చే వరకు కూర్చునేందుకు, సేద తీరేందుకు అవకాశం ఉంటుంది. ఎండాకాలం, వర్షాకాలం ప్రయాణికుల అవస్థలు తగ్గుతాయి. సంబంధిత అధికారులు షెల్టర్లు నిర్మించే దిశగా ఆలోచన చేయాలి.

–చింతకాయల సత్యనారాయణ, తాడేపల్లిగూడెం

శ్రీకృష్ణాలయంలో అఖండ అన్నసమారాధన



మంచిలిలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

అత్తిలి: కృష్ణాష్టమి వేడుకలలో భాగంగా మంచిలి శ్రీకృష్ణాలయం వద్ద శుక్రవారం అఖండ అన్నసమారాధన జరిపారు. భగవాన్ పూతరేకుల అధినేత శిరగాని భగవాన్, నాగు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న అన్నసమారాధనలో ఎమ్మెల్యే పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఆలయ కమిటీ తరపున ఎమ్మెల్యే రాధాకృష్ణను సత్కరించారు. శీతాల వెంకట శ్రీనివాస్, గుత్తుల చంద్రరావు, దొంగ విష్ణుమూర్తి, గంగులూరి కనకం, దువ్వాపు ధనరాజు, గంగాధరం పాల్గొన్నారు.

ముగిసిన నాక్ బృందం పర్యటన

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాక్ పీర్ కమిటీ పరిశీలన శుక్రవారం ముగిసింది. రెండో రోజు పరిశీలనలో కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్, అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం, రికార్డులు, విద్యార్థుల తరగతి గదులు పరిశీలించారు. పీర్ కమిటీ పరిశీలన ముగిసిన అనంతరం జరిగిన కార్యక్రమంలో కమిటీ చైర్మన్ షిరీష్ కుల్‌కర్ని మాట్లాడుతూ విద్యార్థులకు ఆధునిక విద్య అందుబాటులో ఉండే విధంగా అప్‌డేట్ అమలుజేయాలన్నారు. కంప్యూటర్ ల్యాబ్‌లో ఆధునిక కంప్యూటర్‌లను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కళాశాలలో పచ్చదనం, పరిశుభ్రత, విశాలమైన క్రీడా ప్రాంగణం, విద్యార్థులకు అవసరమైన లైబ్రరీలు ఉండడం అభినందనీయమన్నారు. కళాశాల ప్రగతిపై నివేదికను పీర్ టీమ్‌కు ప్రిన్సిపాల్ కె.సుజాత అందజేశారు. కార్యక్రమంలో పీర్ కమిటీ సభ్యులు ఎస్ఎంకే. క్వాద్రీ, కోఆర్డినేటర్ సీహెచ్ అనిల్ పాల్గొన్నారు.

ప్రత్యేక హోదాపై మోదీని నిలదీయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంతెన సీతారాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉమ్మడి పొత్తులలో అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ అధికారంలోకి వచ్చిన తెదేపా, జనసేన, బీజేపీ పార్టీలు ఏపీ రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఎందుకు అడగడం లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మంతెన సీతారాం ప్రశ్నించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం పార్టీ విస్తృత సమావేశం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ అధ్యక్షతన జరిగింది. మంతెన సీతారాం మాట్లాడుతూ కేంద్రంలో తక్కువ సీట్లును సాధించిన భాగస్వాములపై ఆధారపడిన తెదేపా సహకారంతో మూడోవసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ రాజ్యాంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసే ప్రయత్నాన్ని వేగవంతంగా చేసిందన్నారు. రాష్ట్రం విడిపోయి పదేళ్లు పూరైన కాలంలో అధికారంలో ఉన్నది బీజేపీనే అని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రత్యేక హోదా, పోలవరం నిధులు సాధన, విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు వంటి ప్రధానమైన డిమాండ్లను నెరవేర్చడానికి ఎందుకు సిద్ధపడటం లేదని ప్రశ్నించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ జిల్లాలో జ్వర పీడిత ప్రాంతాల్లో ప్రత్యేక మెడికల్ క్యాంపులు పెట్టాలని, ముంపు ప్రాంతాల్లో కాలుష్యాన్ని అరికట్టాలని, వర్షాలు వల్ల నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని కోరారు. సీపీఎం జిల్లా వర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు, చింతకాయల బాబూరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

భీమవరం (ప్రకాశంచౌక్): నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురువారం ఉదయం భీమవరం డిపో గ్యారేజీ ఆవరణలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వైవీ రావు మాట్లాడుతూ 114 జీఓ ప్రకారం నైట్ అవుట్ అలవెన్సులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

చట్టాలపై అవగాహనతో ఉండాలి

కాళ్ల: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్సై ఎస్.శ్రీనివాసరావు సూచించారు. కాళ్ళ మండలం కోలనపల్లి గ్రామంలో సివిల్ రైట్స్ డే కార్యక్రమంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కలిగి ఉండటంతోపాటు సమస్యలపై స్పందించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను తెలుసుకోవాలని, సక్రమంగా అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఇ.నాగార్జున, సర్పంచ్ కె.సూర్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని ఇద్దరికి గాయాలు

ఆకివీడు: మండలంలోని గుమ్ములూరు రోడ్డులో కోళ్లపర్రు వద్ద ఈ నెల 25వ తేదీన మోటారు సైకిల్‌పై వెళ్లుతున్న ఇద్దరు వ్యక్తులను ఆటో ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. బాధితులను 108లో భీమవరం ఆసుపత్రికి తరలించడంతో అక్కడ చికిత్స పొందారు. అనంతరం బాధితులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగరాజు చెప్పారు. గురవయ్య పాలెం నుంచి మోటారు సైకిల్‌పై దానకొండ నాగరాజు, అతని భార్య స్వగ్రామమైన కాకినాడ సమీపంలోని సాగర్ పేటకు బయలుదేరి వెళ్లుతుండగా వేగంగా వచ్చిన ఆటో ఢీకొట్టినట్లు ఫిర్యాదు చేశారన్నారు.

బొలేరో వాహనం ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలు

మండలంలోని గుమ్ములూరు రోడ్డులో ఈ నెల 26న గుమ్ములూరు గ్రామానికి చెందిన చొప్పల చిన్న యోహాన్, అతని స్నేహితుడు మోటారు సైకిల్‌పై కోళ్లపర్రు గ్రామం వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా బొలేరో వాహనం ఢీకొట్టిందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగరాజు శుక్రవారం తెలిపారు.